క్లుప్తంగా

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం

సీఎస్‌పురం(పామూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇటీవల పలు ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా బుధవారం సాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు జె.పోతురాజు, జి.లక్ష్మణకుమార్, ఎన్.దివ్యభారతి, షేక్.రజియా, బి.చిన్ననారాయణ, ఎం సుభాషిణి, ఓ.ఓలేశ్వరరావు, జి.వేమన్నారాయణ, ఎస్.పి.రాధాకృష్ణమూర్తి, జె.వెంకటేశ్వరరావు, టి.వంశీకృష్ణలను హెచ్ఎం షేక్.ఖాదరున్నీసాబేగం ఘనంగా సన్మానించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మేనేజర్ ప్రసాద్

పీసీపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పెదఈర్లపాడు కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రసాదు అన్నారు. మండల పరిధిలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ అనిల్ కుమార్, ఉపాధ్యాయులు మాధవరావు, స్వర్ణ రమణయ్య, అరుణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి సప్తాహం



సాయి సప్తాహంలో భక్తులు

కనిగిరిరూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో సాయి సప్తాహం నిర్వహించారు. బాబా ఆలయంలో జ్యోతి ప్రజ్వలన, గోపూజ, సాయి బిక్ష కార్యక్రమాలను ఎంతో నిష్ఠతో నిర్వహించారు. ఏడు రోజుల సాయి నామ సంకీర్తనలు నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సానికొమ్ము పద్మ రంగనాయకులరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. మనోహర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, బోయిళ్ల తిరుపతిరెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, బాలు ఓబులరెడ్డి, ముచ్చర్ల ధర్మారావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, వేమా రంగ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాలిక తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న

టంగుటూరు: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న అన్నారు. స్థానిక బీసీ కాలనీలో బుధవారం బాల్య వివాహం జరుగుతుందన్న విషయం తెలుసుకొని హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాన్ని నిలుపుదల చేయించి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. 18 ఏళ్ల లోపు బాలికకు వివాహం చేస్తే చిన్న వయసులోనే గర్భధారణ, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. చట్టప్రకారం బాల్య వివాహాలు నేరమని, అలా చేస్తే తల్లిదండ్రులకు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంఈఓ బాలాజీ, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పొందూరులో తనిఖీలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ లీనా

టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామంలో అక్రమంగా మద్యం గంజాయి అమ్ముతున్నారని మంత్రి స్వామికి మహిళలు మంగళవారం ఫిర్యాదు చేశారు. బుధవారం సాక్షిలో ×పొందూరులో విచ్చలవిడిగా మద్యం, గంజాయి× అన్న శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన ఒంగోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి పొందూరు గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లీనా మాట్లాడుతూ గంజాయి అక్రమ మద్యం గ్రామంలో నిర్వహిస్తుంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, అమ్ముతున్న వారి వివరాలు అందించాలని, సమాచారం అందించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గీతా సిబ్బంది పాల్గొన్నారు.



గణేషునిపల్లె సమీపంలో గుంతలుగా ఉన్న రోడ్డు



వి.బైలు సమీపంలో గుంతలుగా ఉన్న రోడ్డు

అడుగుకో గుంత.. తప్పని చింత

- గుంతల మయంగా రహదారులు
- కనీస మరమ్మతులు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు



గుంతలుగా ఉన్న వి.బైలురోడ్డు



చెన్నపునాయునిపల్లె సమీపంలో గుంతలుగా ఉన్న రోడ్డు

సీఎస్‌పురం(పామూరు):

మండలంలో ఆర్అండ్‌బీ రోడ్లు గోతులమయంగా మారాయి. అడుగుకో గుంత ఉండటంతో ఏ క్షణంలో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనన్న చందాన గుంతలతో నిండి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం నుంచి కోవిలంపాడుకు వెళ్లే రహదారి డబుల్ రోడ్డు సైతం సీఎస్‌పురంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో గుంతలతో నిండి ప్రమాదకరంగా ఉంది. సీఎస్‌పురం నుంచి డీజీపేట వైపు 167బీ జాతీయ రహదారివరకు వెళ్లే రోడ్డు సైతం గుంతలతో నిండి ఉంది. ఇక మండలంలోని గణేషునిపల్లె నుంచి చెన్నపునాయునిపల్లె, వి.బైలు, వెళ్లేరోడ్డు గుంతలతో ఉండగా ఆ రోడ్డుపై ప్రయాణం పాదచారులకు, ద్విచక్రవాహనదారులకు, స్కూల్ బస్సులకు, ఇతర వాహనదారులకు నరకప్రాయాన్ని చూపుతోంది. ఈ రోడ్డు నుంచి వి.బైలు, చెన్నపునాయునిపల్లె గ్రామాలకు చెందిన విద్యార్థులు అంబవరం హైస్కూల్‌కు, సీఎస్‌పురంలోని జూనియర్ కళాశాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుండగా వారు పడే బాధలు అన్నీ ఇన్నీకావు. అదేవిధంగా రేగులచెలక గ్రామం నుంచి గుంతచెన్నంపల్లెకు వెళ్లే రోడ్డు మొత్తం సుమారు 6 కి.మి.లలో గతంలో సుమారు 2.5 కి.మి. తారురోడ్డు వేసేందుకు మొదలు పెట్టి కంకరతోలగా రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అదేవిధంగా మిగిలిన మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు బాధలు అన్నీ ఇన్నీ కావు. ఉప్పలపాడు నుంచి సీఎస్‌పురానికి వెళ్లే తారురోడ్డు కూడా పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణం కష్టంగా ఉంది. పాలకులు, అధికారులు తక్షణం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రోడ్లు గుంతల మయంగా ఉన్నా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా అధ్వానంగా ఉన్న గుంతల రోడ్లుకు కనీస మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చలేకపోవడం విడ్డూరంగా ఉంది. పాలకులు తక్షణం యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూసి, తమ కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిప్స్ తోలి వదలివేసిన రేగులచెలక-చెన్నంపల్లి రోడ్డు

కోటయ్యను పరామర్శించిన బుర్రా



కోటయ్యను పరామర్శిస్తున్న బుర్రా

కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు గ్రామ నాయకుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దగ్గుమాటి కోటయ్యను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరులోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల కోటయ్య, మరి కొందరిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. బెయిల్‌పై వచ్చిన కోటయ్య, కళ్యాణ్‌లను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు ఎవరూ ఆధైర్యపడవద్దన్నారు. ఆయన వెంట నాయకులు తోకల కొండయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ఈదర వెంకట రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ, గంగిరెడ్డి, చీమల వెంకటరాజా, వై.నాగభూషణం, ముప్పవరపు కిశోర్, గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్, బ్రహ్మయ్య, బిళ్లా రమణయ్య, గుళ్లా రోశయ్య, నరసింహం తదితరులు ఉన్నారు.

మెయింటినెన్స్‌లో అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ క్రిష్టారెడ్డి

పామూరు: విద్యుత్ సిబ్బంది సబ్‌స్టేషన్ మెయింటినెన్స్‌లో అప్రమత్తంగా ఉండాలని ఏడీఈ కృష్ణారెడ్డి అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఏఈ జిలానీ అధ్యక్షతన పామూరు సబ్ డివిజన్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాలకు సంబంధించిన సెక్షన్ల షిఫ్ట్ ఆపరేటర్స్‌తో ఏడీఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఈ వారికి సబ్‌స్టేషన్ మెయింటినెన్స్, ఎల్‌సి ఇచ్చే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది అవలంబించాల్సిన భద్రతా చర్యలు గురించి వివరించారు. అదేవిధంగా విద్యుత్ వినియోగదారుల నుండి ఫోన్ వచ్చిన సందర్భంలో సమాధానం చెప్పాలని, సబ్‌స్టేషన్ ఆవరణలో, మండల కేంద్రమైన పామూరులో విద్యుత్ సర్వీసులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభపై రైతులకు సమాచారమేదీ..?



గ్రామసభ సమాచారం లేదంటున్న రామకృష్ణాపురం వాసులు

ఉలవపాడు: భూసేకరణపై ఈ నెల 4న గ్రామసభ జరుగుతుందని అధికారులు పత్రికా ప్రకటన ఇవ్వడం తప్ప రైతులకు ఏ మాత్రం సమాచారం ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేసిన తరువాత 4న గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలియచేశారు. కానీ గ్రామసభ నిర్వహిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అనే అనుమానాలు మాత్రం అధికారుల్లో నెలకొంది. దీంతో రైతులందరికీ తెలియకుండా కేవలం పత్రికా ప్రకటన ఇస్తే కొందరే చూస్తారు అనే అభిప్రాయంతో స్థానిక తహశీల్దార్ శ్రీనివాసరావు 4న గ్రామసభ జరుగుతుందని తెలియచేశారు. కరేడులోని 1వ గ్రామ సచివాలయంలో ఇండస్ట్రీయల్ హబ్ స్థాపనకు గ్రామసభ జరుగుతుందని తెలియచేశారు. కానీ భూములు ఉన్న రైతులకు మాత్రం తెలియచేయలేదు.

రైతులకు సమాచారం ఏదీ....

గ్రామసభ అంటే భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు కచ్చితంగా నోటీసు ద్వారా కానీ, రెవెన్యూ సిబ్బంది ద్వారా కానీ తెలియచేయాలి. కానీ రైతుకు మాత్రం సమాచారం చేరలేదు. కరేడు రెవెన్యూ పరిధిలో ఉలవపాడుకు చెందిన సుమారు 400 మందిపైన రైతులు ఉన్నారు. వారికి ఎలాంటి సమాచారం లేదు. ఇళ్లు కోల్పోతున్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కేవలం పత్రికా ప్రకటన ద్వారానే అంతా సమాచారం వెళ్తుందని రెవెన్యూ అధికారులు అనుకోవడం ఇబ్బందికరమని ప్రజలు అంటున్నారు. భూములు ఉన్నవారికి ప్రతి ఇంటికి నోటీసు అందించకుండా ఎలా గ్రామసభ నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. తక్కువ మందితో గ్రామసభ నిర్వహించాలనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నేడు చిన షరిగత్తు వేడుకలు



సయ్యద్ మకానంలో పూజలందుకుంటున్న పీర్లు



శంఖవరంలో విద్యుత్‌దీపాలతో ముస్తాబైన పీర్ల చావిడి


- ముస్తాబైన పీర్ల చావిడ్లు

కనిగిరిరూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా, మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం(పీర్ల పండుగ) చిన షరిగత్ వేడుకలు గురువారం కనిగిరి పట్టణంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని పలు పీర్ల చావిడ్లలో (అషూరా ఖానాల్లో) వివిధ నామ కరణాలు కల్గిన (హజరత్) పీర్లను కొలువు తీర్చి పూజలు అందిస్తున్నారు. పట్టణంలోని మయాన మకాన్, సయ్యద్ మకాన్, మంగలి మాన్యం, టకారిపాలెంలతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం పీర్ల చిన షరిగత్తు వేడుకలు జరగనున్నాయి. ఈమేరకు ముజావర్లు సర్వసిద్ధం చేస్తున్నారు. చిన షరిగత్ పురస్కరించుకుని సయ్యద్ మకాన్(అక్బర్‌వలి పీర్ల) చావిడిలో ×ఇమామే ఖాశింకు సేరా బాండ్‌నా× కార్యక్రమం అత్యంత నియమ నిష్టలతో ముజావర్లు నిర్వహిస్తారు. అనంతరం పీర్లకు జరిగే ప్రత్యేక పూజల్లో కుల, మత, వర్గాల కతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. అర్ధ రాత్రి దాటిన తర్వాత పలు పీర్ల చావిడ్ల వద్ద పీర్ల గ్రామోత్సవ వేడుకలు జరుగుతాయి. ఈనెల 04వ తేదిన సందు(విడిది దినం) 05న (శనివారం) పెద షరిగత్తు, 06న ఆదివారం షహదత్(పీర్లు బావికి వెళ్లేరోజు, జలధి కార్యక్రమం), 08న మంగళవారం పీర్ల జియారత్‌లు జరుగుతాయని ముజావర్లు తెలిపారు. శంఖవరం గ్రామంలో పీర్ల (మొహర్రం) పీర్ల చిన షరిగత్తు వేడుకలు బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇమామే హుసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం, బారాయిమామ్ తదితర నామకరణాలు కల్గిన పీర్లలకు విశిష్ట పూజలు చేశారు. కుల, మత వర్గాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి పీర్ల గ్రామోత్సవం జరిగింది.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు: విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం నాగేశ్వరరావు అన్నారు. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సరైన జాగ్రత్తలు పాటించకుండా విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు టీఎం రాఘవేంద్రరావు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగని పొగాకు బేళ్ల తిరస్కరణ




టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఏడవ రౌండ్ ప్రారంభం నుంచి పొగాకు బేళ్లు అధిక సంఖ్యలో తిరస్కరణకు గురవుతున్నాయి.దీంతో రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడో రౌండ్ ప్రారంభమైన రోజు నుంచి బుధవారం వరకు రోజుకు దాదాపుగా 200 పైచిలుకు బేళ్లు తిరస్కరణకు గురవుతూ వచ్చాయి. అసలే మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బేళ్ల తిరస్కరణతో ఖర్చు అధికమవుతుందని వాపోతున్నారు. అధికారులు అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని వ్యాపారస్తులకు సూచించినా వ్యాపారస్తులు పట్టించుకోవట్లేదు. గత సంవత్సరంలో కేజీ రూ.240 పలికిన లో గ్రేడ్ పొగాకును వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో తీసుకుని వచ్చిన బేళ్లను రైతులు వెనక్కి తీసుకొని వెళ్లిపోతున్నారు. బేళ్లను వెనక్కి తీసుకొని పోవడంతో బేళ్లు చెదిరి కాటా తగ్గుతుందని., మళ్లీ వేలానికి తీసుకురావాలంటే బేలుకు రూ.2 వేల వరకు నష్టంవస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరలా వేలానికి తీసుకొని రావాలంటే దాదాపు ఒక బేల్ కి 2000 వరకు నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం క్లస్టర్ పరిధిలోని పెద్దకల్లగుంట, అయ్యప్ప రాజుపాలెం, చతుకుపాడ, కె. అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు 958 బేళ్లను తీసుకురాగా 728 బేళ్లను కొనుగోలు చేసి 230 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలికింది.

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో రోజు రోజుకూ తిరస్కరణ బేళ్లా తిరస్కణ ఎక్కువవుతోంది. బుధవారం నిర్వహించిన వేలంలో 219 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రానికి పొందూరు గ్రామానికి చెందిన రైతులు 814 బేళ్లను తీసుకురాగా 595 బేళ్లు కొనుగోలు చేశారు. గరిష్గ ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలికింది.

విద్యుత్ పొదుపుగా వాడండి



విద్యుత్ శాఖ అధికారులు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: విద్యుత్‌ను పొదుపుగా వాడటంతో పాటు భద్రతా చర్యలు పాటించాలని విద్యుత్ శాఖ ఏడీఈ పి.యుగంధర్ విద్యుత్ వినియోగదారులకు సూచించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు-భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఏడీఈ పి.యుగంధర్ మాట్లాడుతూ బొగ్గు నిల్వలు తగ్గిపోతున్నాయని, నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీంతో విద్యుత్ ఉత్పత్తి భారంగా మారే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ విధానం వల్ల క్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు వినియోగదారులకు డబ్బులు ఆదా అవుతాయన్నారు. వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు చెట్ల కింద ఉండవద్దని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పాకల రోడ్డు వరకు విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఈ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కౌలు రైతుకూ సీసీఆర్‌సీ కార్డులు



మాట్లాడుతున్న తహసీల్దార్ మహాలక్ష్మి

వలేటివారిపాలెం(లింగసముద్రం): కౌలు రైతులంతా విధిగా సీసీఆర్‌సీ కార్డులు పొందాలని తహసీల్దార్ సీతా మహాలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కౌలు రైతులంతా కార్డులు పొందేలా వీఆర్‌ఓలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. ఏఓ రవికుమార్, ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నట్టల నివారణకు మందు పంపిణీ



జీవాలకు మందులు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

వలేటివారిపాలెం: మండలంలోని శామీరపాలెంలో బుధవారం ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మందులు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సన్న జీవాల రైతులకు నోటి జబ్బుకు ముందస్తు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. పోకూరు పశు వైద్యులు డాక్టర్ సుధాకర్, సర్పంచ్ నవ్వులూరి రాజరమేష్, పశు వైద్య సహాయకులు చౌదయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న దాతలు

హనుమంతునిపాడు: మండలంలోని నందనవనం ఆదర్శ పాఠశాలలో 65 మంది విద్యార్థులకు దాతలు రూ.16 వేల విలువైన సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య మాట్లాడుతూ ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణ స్వామి, కుక్కలరి వెంకట కోటయ్య జ్ఞాపకార్థం సూర్యనారాయణ, ఉమామహేశ్వరరావు వీటిని అందజేశారన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. హెచ్ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి



సమ్మె నోటీస్ ఇస్తున్న సీఐటీయూ నాయకులు

పొన్నలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు అన్నారు. పొన్నలూరులో బుధవారం సీఐటీయూ అనుబంధ విభాగాల ఉద్యోగస్తులు, మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద వైఖరిని అవలంబిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్నారన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేసి, అంగన్‌వాడీ, ఆశా, వీఓఏ వంటి చిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ నెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం డీటీ స్రవంతికి సమ్మె పత్రాన్ని అందజేశారు. వై సత్యవతి, ఎంపీ సుబ్బరామయ్య, పి. మధురవాణి తదితరులు పాల్గొన్నారు.